క్లుప్తంగా

స్టడీ మెటీరియల్ పంపిణీ



జఫర్‌గఢ్: మండలంలోని కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్‌ను పాఠశాల గోల్డెన్ జూబ్లీ కమిటీ సభ్యులు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎండీ పర్వేజ్ మాట్లాడుతూ ప్రతి ఏడాది మాదిరిగా ఈ సంవత్సరం కూడా ఎన్‌ఎంఎంఎస్‌లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని స్టడీ మెటీరియల్‌ను అందించినట్లు చెప్పారు.

గొడుగుల..

పాలకుర్తి: మల్లంపల్లి గ్రామంలోని హైస్కూల్‌లో వీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మొలుగూరి యాకయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం గొడుగులను పంపిణీ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, హెచ్‌ఎం ప్రవీణ్‌కుమార్ తోటకూర శ్రీనివాస్, వెంకన్న పాల్గొన్నారు.

బీసీల రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీలో పెట్టాలి

జనగామ రూరల్: కులగణన చేపట్టి బీసీల రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీలో పెట్టాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు మంగళంపల్లి జనార్దన్ కోరారు. ఈ మేరకు సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్ రిజ్వాన్ బాషాకు వినతి పత్రం అందజేశారు. నాయకులు ఆదిసాయన్న, సుదర్శన్, అశోక్ పాల్గొన్నారు.

అభివృద్ధికి పెద్దపీట

బచ్చన్నపేట: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని, పెట్టుబడిదారులను రప్పించడానికే విదేశీ యాత్రలో ఉన్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి యూత్ నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసి పని చేయాలన్నారు. మండల యూత్ అధ్యక్షుడిగా అందరితో కలిసి పనిచేసే ఎద్దు హరీశ్‌ను ఆదరించాలని కోరారు. వెంకటాచారి, రవీందర్ రెడ్డి, విద్యానాథ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సికింద్రాబాద్‌కు తరలిన నాయకులు

రఘునాథపల్లి/బచ్చన్నపేట: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు రావడంపై సికింద్రాబాద్‌లో నిర్వహించే భారీ ర్యాలీకి రఘునాథపల్లి, బచ్చన్నపేట మండల కేంద్రం నుంచి ఎమ్మార్పీఎస్, దాని అనుబంధ సంఘాల నాయకులు మంగళవారం తరలివెళ్లారు. ముందుగా మండల కేంద్రాల్లో ర్యాలీ నిర్వహించారు.

తపాలా సేవలు వినియోగించుకోవాలి

లింగాలఘణపురం: తపాలా శాఖ అందించే సేవలను వినియోగంచుకోవాలని జనగామ ఈస్ట్ సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.రవి కోరారు. మంగళవారం నేలపోగులలో డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా స్థానిక పోస్ట్‌మాస్టర్ తేజస్విని అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మేయిల్ ఓవర్సీర్ భాస్కర్, పోస్టు మాస్టర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ అందజేత



బచ్చన్నపేట: మండలంలోని సాల్వాపూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలకు గ్రామానికి చెందిన చీర్ల మల్లేశం యాదవ్ మైక్‌సెట్‌ను మంగళవారం బహూకరించారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని, ఉత్తమ ఉపాధ్యాయులతో బోధన ఉంటుందని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి గ్రామస్తులు సహకరించాలని కోరారు. హెచ్‌ఎం మధుకర్ రెడ్డి, గ్రామస్తులు బత్తిని వెంకటేష్, శ్రీహరి, నిమ్మల రాజు పాల్గొన్నారు.

పాఠశాలకు రంగులు..

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలకు పూర్వ విద్యార్థి దొంతుల చంద్రమౌళి, పాఠశాల జూనియర్ అసిస్టెంట్ మున్న గోడలకు వేసే రంగులను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఇద్దరూ కలిసి రూ. 20 వేల విలువ చేసే రంగులను అందించారని, వాటిని గదులకు వేయిస్తామని చెప్పారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అల్పాహారం..

జనగామ రూరల్: లయన్స్ క్లబ్ ప్రతినిధి ఏలె రాము పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి అల్పాహారం అందజేశారు. చందుపట్ల రవీందర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా గోదాం

- పశువులకు నిలయంగా మారిన పరిస్థితి
- ఎగిరిపోతున్న గిడ్డంగి పైకప్పులు
- వినియోగంలోకి తీసుకురావాలంటున్న రైతులు

చిల్పూరు: రైతు శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతోందంటూ ఉపన్యాసాలు ఇచ్చే ప్రజా ప్రతినిధులు శంకుస్థాపనలు చేశాక పూర్తయిన భవనాలను మాత్రం ప్రారంభించక పోవడంతో అవి నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. అందుకు నిదర్శనం మండలంలోని రాజవరం గ్రామంలో వ్యవసాయ ఉత్పత్తులు నిల్వ చేసే గోదాం. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర వచ్చే వరకు నిల్వ చేసుకునేందుకు నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 2016 ఏప్రిల్ 4వ తేదీన రూ. 39 లక్షల వ్యయంతో గోదాం నిర్మాణ పనులకు అప్పటి ఎమ్మెల్యే రాజయ్య శంకుస్థాపన చేయగా కాంట్రాక్టరు పూర్తిచేశారు. దీంతో గ్రామ రైతులు తాము పండించిన పంటలను నిల్వచేసుకునే వీలుకలిగిందని ఎంతో సంతోష పడ్డారు. కానీ ప్రారంభం కోసం ఎదురు చూస్తుండగా నిర్మించిన మూడు నెలలకు కురిసిన భారీ వర్షాలకు గోదాం చుట్టూ ఉన్న ప్రహరీ కూలిపోవడంతో పాటు ధాన్యాన్ని ఆరబోసే ప్లాట్ ఫాం దెబ్బతింది. విషయం తెలిసిన కాంట్రాక్టర్ తిరిగి తూతూమంత్రంగా పనులు చేసి వెళ్లిపోయాడు. దీంతో రూ. లక్షల వ్యయంతో నిర్మించిన గోదాం 8 ఏళ్లుగా ఉపయోగంలోకి తీసుకరాకపోవడంతో పశువులకు నిలయంగా మారింది. ఈదురుగాలకు గోదాం పైకప్పులు ఎగిరిపోతున్నాయి. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక చొరవ తీసుకుని గిడ్డంగిని రైతుల కోసం వినియోగంలోకి తేవాలని పలువురు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న గోదాం



వర్షాలకు దెబ్బతిన్న ధాన్యం ఆరబోసే ప్లాట్ ఫాం

గ్రామ పంచాయతీకి అప్పగించాలి..



రైతులు ధాన్యం నిల్వ చేసుకునేందుకు నిర్మించిన గిడ్డంగిని గ్రామ పంచాయతీకి అప్పగిస్తే, వారి పర్యవేక్షణలో ఎందరికో ఉపయోగగంగా ఉంటుంది. అధికారులు స్పందించాలి.

– మారేపల్లి కిషన్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్

గిడ్డంగులు లేక ఇబ్బందులు



లక్షల వ్యయంతో రైతుల కోసం నిర్మించిన గోదాంను వినియోగంలోకి తేవాలి. రైతులు ధాన్యం నిల్వ చేసుకునేందుకు గిడ్డంగులు లేక ఇబ్బంది పడుతున్నారు.

– రంగు రవి, రైతు

జీపీకి ఇస్తే వినియోగంలోకి తెస్తాం..



గ్రామంలో రైతుల కోసం నిర్మించిన గోదాంను జీపీకి అప్పగిస్తే వినియోగంలోకి తెస్తాం. అందులోకి పశువులు, గొర్రెలు తోలవద్దని గతంలో నోటీసులు అందజేశాం. ఆదేశాలు వస్తే చర్యలు తీసుకుంటాం.

– తండ రాంబాబు, ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శి

పద్మశాలీలు ఐక్యత చాటాలి

రఘునాథపల్లి: ఈనెల 18వ తేదీన పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిని గెలిపించేందుకు ఐక్యతను చాటాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ వేముల బాలరాజు, జిల్లా ప్రచార కార్యదర్శి చింతకింది కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రంలో మంగళవారం ఎన్నికల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు కరిమికొండ వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడిగా వల్లకాటి రాజ్‌కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో దోర్నాల వెంకటేశ్వర్లు, గుండ కృష్ణమూర్తి, బాల నర్సయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

చిల్పూరు: ఈనెల 18వ తేదీన నిర్వహించే రాష్ట్ర పద్మశాలి అధ్యక్షుడి ఎన్నికను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు వేముల బాలరాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు చిన్నపెండ్యాలలో సంఘం నియోజకవర్గం ఇన్‌చార్జ్, మండల అధ్యక్షుడు గజ్జెల దామోదర్ నివాసంలో ఎన్నికల ప్రచార వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా పోటీలో ఉన్న వల్లకాటి రాజ్‌కుమార్ మగ్గం గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, దామోదర్, బండారి రాజ్‌కుమార్, తాటి శ్రీదర్, అశోక్, కనుకంట్ల యాదగిరి, నాగభూషణం, నారాయణ, రాములు పాల్గొన్నారు.



రఘునాథపల్లి: వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

జఫర్‌గఢ్‌లో..

జఫర్‌గఢ్: తొలిసారిగా ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించబోతున్న పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నికలో పద్మశాలీలంతా భాగస్వాములు కావాలని సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు వేముల బాలరాజు కోరారు. సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నాయకులు, పద్మశాలీలు ఎన్నికల ప్రచార వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. దోర్నాల వెంకటేశ్వర్లు, గుమ్మడవెల్లి సత్యనారాయణ, మామిడాల సోమనారాయణ, బైరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బోనాలు

కొడకండ్ల: మండలకేంద్రంలో మంగళవారం బోనాలను వైభవంగా నిర్వహించారు. స్థానికులు తమ ఆరాధ్యదైవంగా భావించే కాలబైరవ(బయ్యన్న), ముత్యాలమ్మ ఆలయాలకు బోనాలతో వెళ్లి మొక్కులు సమర్పించారు. ఏఎస్సై కత్తి రమేష్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

పాఠశాలలో..

జఫర్‌గఢ్: మండల కేంద్రంలోని గీతాంజలి పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు మంగళవారం ఘనంగా బోనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు బోనాలు ఎత్తుకుని పోతరాజులు, శివసత్తుల వేషధారణతో నృత్యాలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాడెంట్ మేర్గు నర్సింగం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కొడకండ్ల: బోనాలతో మహిళలు

ఎమ్మెల్యే, ఎంపీని కలిసిన సముద్రాల నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని సముద్రాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇనుగాల వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు హనుమకొండలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామంలోని శ్రీమహంకాళి ఆలయాన్ని ధర్మకర్త, నిర్మాణకర్త కుందూరు నాగమణి, సోమిరెడ్డి ఆధ్వర్యంలో పునర్నిర్మాణం కోసం నేడు (బుధవారం) చేయనున్న శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరుకావాలని ఎంపీని, ఎమ్మెల్యేను వారు కోరారు. గుండె నర్సయ్య, తాటికొండ కుమార్, ఓరుగంటి వెంకటేశ్వర్లు, పడిశాల వెంకటేశ్, సత్తిరెడ్డి, బత్తుల బాలరాజు, రాజు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి



సమావేశంలో తీర్మానం చేస్తున్న గ్రామ పెద్దలు

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో గ్రామ దేవతల పండుగలు అందరూ సమన్వయంతో ప్రశాంతంగా జరుపుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు చింతకుంట్ల నరేందర్‌రెడ్డి కోరారు. ఘన్‌పూర్‌లో పోచమ్మ బోనాల పండుగ నిర్వహణ కోసం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈఓ సత్యనారాయణ అధ్యక్షతన గ్రామానికి చెందిన వివిధ కులాల పెద్దలు మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని కులాల వారు, గ్రామస్తులు సమన్వయంతో పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. ఈనెల 14న(బుధవారం) విశ్వబ్రాహ్మణుల పోచమ్మ బోనాలు, ఈనెల 18న అన్ని కులాలకు సంబంధించిన పోచమ్మతల్లి బోనాల పండుగను నిర్వహించాలని సమావేశంలో తీర్మానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గన్ను నర్సింహులు, మునిగెల రాజు, మునిగెల వెంకటేశ్వర్లు, గట్టు రమేష్, బంగ్లా శ్రీను, గోనెల ఉపేందర్, సింగపురం వెంకటయ్య, చింత ఎల్లయ్య, పెసరు సారయ్య పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత

దేవరుప్పుల : ఫామ్‌ల్యాండ్ లేఔట్ వెంచర్ల పేరిట చేపట్టిన అక్రమ కట్టడాలను రెవెన్యూ అధికార యంత్రాంగం కూల్చివేసిన సంఘటన మంగళవారం నీర్మాలలో చోటుచేసుకుంది. మండలంలోని నీర్మాలలో అనుమతులేని వెంచర్‌పై పలు పార్టీల నాయకులు జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాకు ఫిర్యాదు చేయగా స్పందించిన కలెక్టర్ సత్వర చర్యలకు ఆదేశించారు. దీంతో మంగళవారం మండల అధికారులు నీర్మాలలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను కూల్చివేశారు. ఈ విషయమై తహసీల్దార్ హుస్సేన్ మాట్లాడుతూ వ్యవసాయ భూమిని కమర్షియల్ (నాలా)గా మార్చడం వరకు మాత్రమే రెవెన్యూ పరిధిలో ఉంటుందన్నారు. నాలా చేసిన భూమిలో లే ఔట్ నిబంధనలను పర్యవేక్షించాల్సిన బాధ్యత పంచాయతీ పరిధిలోకి వస్తుందన్నారు. జీపీ చట్టం మేరకు లేఔట్ చేయకుండా క్రయవిక్రయాలు జరిపితే చట్టపరంగా చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ సురేష్‌కుమార్, ఆర్‌ఐలు రాజు, ఆంధ్రయ్య తదితరులు ఉన్నారు.



కట్టడాలను కూల్చివేయిస్తున్న రెవెన్యూ అధికారులు

వీధి లైట్ల నిర్వహణ చేపట్టాలి



లింగాలఘణపురం: మండలంలోని పలు గ్రామాల్లో ఆగిపోయిన వీధిలైట్ల నిర్వహణను చేపట్టాలని మంగళవారం కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కొల్లూరి శివకుమార్, మాజీ జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీఓ జలేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో గ్రామాల్లో గ్రామ దేవతల పండుగలు కొనసాగనున్న నేపథ్యంలో ప్రజలు ఇబ్బంది పడకుండా వీధిలైట్లను పునరుద్ధరించాలని కోరారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దిలీప్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు దూసరి గణపతి, బుషిగంపల ఆంజనేయులు, నీలం మోహన్, రాజశేఖర్, మల్లేశం, బలరాజు, నాగరాజు, కారంపురి చంద్రయ్య, అశోక్, శ్రీనువాసు, అబ్బాస్ ఉన్నారు.

క్షేత్ర విజ్ఞానం విద్యార్థులకు ఉపయోగం

నర్మెట: క్షేత్ర పరిశీలనలో పొందిన విజ్ఞానం విద్యార్థులకు ఎంతో ఉపయోగమని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ టి. శరత్ కుమార్ అన్నారు. పాఠశాల ఒకేషనల్ ఎడ్యుకేషన్ అగ్రికల్చర్ కోర్సు విద్యార్థులు క్షేత్ర పరిశీలనలో భాగంగా మంగళవారం ముల్కనూర్ డెయిరీని సందర్శించారు. ఈసందర్భంగా డెయిరీ ఫాం నిర్వహణ, సహకార సంఘం వివరాలు, యాజమాన్య పద్ధతులు, విత్తన ఉత్పత్తి, ధాన్యం కొనుగోలు, ఎరువుల విక్రయం, స్వయం ఉపాధి కల్పన, స్వయం సేవక సంఘాలతో మహిళలు సాధిస్తున్న ఆర్థికాభివృద్ధిని నిర్వాహకులు విద్యార్థులకు వివరించారు. ఒకేషనల్ ఉపాధ్యాయులు అనిల్ రెడ్డి, సాయిబాబ, మౌనిక, విద్యార్థులు, డైరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ముల్కనూర్ డెయిరీలో మోడల్ స్కూల్ విద్యార్థులు

రోడ్డు దాటే సమయంలో జాగ్రత్తలు పాటించండి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై నవీన్‌కుమార్

చిల్పూరు: మండలంలోని వంగాలపల్లి, నష్కల్, చిన్నపెండ్యాల గ్రామాల బస్ స్టేజీల సమీపంలో యూటర్న్‌లు, కాలినడకన రోడ్డు దాటే సమయంలో జాగ్రత్తలు పాటించాలని ఎస్సై నవీన్‌కుమార్ సూచించారు. మండలంలోని చిన్నపెండ్యాలలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా యూటర్న్‌లు, బస్సుల కోసం ఎక్కే ప్రయాణికులు రోడ్డు దాటుతున్న క్రమంలో ఇరువైపులా చూడకపోవడంతో ప్రమాలాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. చిన్నపెండ్యాలలో ప్రయాణికుల సంఖ్య ఎక్కువగా ఉటుండటంతో నేషనల్ హైవే అధికారులతో మాట్లాడి ఫుట్ ఓవర్ బ్రిడ్జి, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటునకు కృషిచేస్తానని తెలిపారు. తాళ్లపల్లి సమ్మయ్య, గజ్జెల దామోధర్, జనగాం యాదగిరి, రాజన్‌బాబు, బుచ్చయ్య, వెంకటస్వామి, హరిబాబు, మాచర్ల రాజు, క్రాంతికుమార్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



సదయ్య మృతదేహం

జఫర్‌గఢ్: అనారోగ్య సమస్యతో పశువుల కొట్టంలో ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని కూనూర్ గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై రామ్‌చరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొళిపాక సదయ్య(42) గ్రామంలో సెలూన్ షాపు నిర్వహణతోపాటు వ్యవసాయం చేసి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొద్దిరోజుల నుంచి అనారోగ్య సమస్యతో బాధపడుతున్న సదయ్య పశువుల మేతకు వేస్తానని ఇంట్లో చెప్పి సమీపంలోని పశువుల కొట్టం వద్దకు వెళ్లాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు ఆందోళనకు గురై కొట్టం వద్దకు వెళ్లి చూడగా అప్పటికే సదయ్య ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయాన్ని కుటుంబ సభ్యులు పోలీసులకు తెలుపడంతో మంగళవారం ఘటన స్థలానికి వారు చేరుకొని శవపంచనామ నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి



మల్లేష్ (ఫైల్)

రఘునాథపల్లి: మద్యం ఎందుకు తాగావని భార్య ప్రశ్నించడంతో క్షణికావేశంలో ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలోని ఇబ్రహీంపూర్‌లో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన దొరగొల్ల మల్లేష్ (25) తన తండ్రికి చేదోడువాడుగా ఉంటూ వ్యవసాయం చేస్తుండేవాడు. ఈ నెల 10న స్నేహితులతో కలిసి మద్యం సేవించి ఇంటికి చేరుకున్నాడు. మద్యం ఎందుకు తాగావని భార్య అనూష ప్రశ్నించడంతో మల్లేష్ క్షణికావేశంలో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. తల్లి కొమురమ్మ, భార్య అనూషలు గుర్తించి వెంటనే జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచనతో వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ములుగు రోడ్డులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మరణించాడు. మృతుడికి భార్యతో పాటు నాలుగేళ్ల కుమారుడు, రెండేళ్ల కూతురు ఉన్నారు. మృతుడి తండ్రి దొరగొల్ల యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి నరేష్ తెలిపారు. కాగా, అందరితో కలివిడిగా ఉండే మల్లేష్ మృతిపట్ల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న వివిధ పార్టీల నాయకులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

గుండెపోటుతో వ్యక్తి..

జనగామ రూరల్: వరిపొలానికి మందు పిచికారీ చేస్తుండగా గుండెపోటుతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని ఎర్రగొల్లపహాడ్‌లో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పట్టుపాక మహేందర్ (32) హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. గ్రామంలో తనకున్న వ్యవసాయ పొలంలో వరికి పురుగు మందు పిచికారీ చేస్తుండగా ఒక్కసారిగా చాతిలో నొప్పి రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య భవాని, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆగి ఉన్న బస్సును ఢీకొన్న కారు

స్టేషన్‌ఘన్‌పూర్: జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న ఆర్టీసీ పల్లెవెలుగు బస్సును కారు వెనుక నుంచి ఢీకొట్టిన సంఘటన మండలంలోని రాఘవపూర్‌లో మంగళవారం మధ్యాహ్నం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఆర్టీసీ పల్లెవెలుగు బస్సు హనుమకొండ నుంచి జనగామకు వెళ్తున్న క్రమంలో రాఘవాపూర్ బస్టేజీ వద్ద ఆగింది. అదే సమయంలో నేషనల్ హైవే అథారిటీకి చెందిన వారు కారులో రఘునాథపల్లి వైపుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కారు ముందు ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగంగా ధ్వంసం కాగా ఎవ్వరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

బెల్టు షాపుపై దాడి

చిల్పూరు: మండలంలోని వెంకటాద్రిపేట గ్రామంలో మంగళవారం సాయంత్రం స్థానిక ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ బెల్టు షాపుపై దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా అక్రమంగా నిల్వ చేసిన రూ. 4,200 విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకుని విక్రయదారుడు తడగోని నరేందర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బాలిక కిడ్నాపర్ అరెస్ట్, రిమాండ్

దేవరుప్పుల: బాలికను కిడ్నాప్ చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్ చేసినట్టు ఎస్సై ఊర సృజన్‌కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. ఈ నెల 5వ తేదీన మండలంలోని గొల్లపల్లికి చెందిన ఓ మైనర్ బాలికను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప జిల్లా రాయచోటికి చెందిన కొర్లకంట నరేష్ మాయమాటలు చెప్పి తీసుకెళ్లాడు. ఈ విషయమై బాధితురాలి తల్లిదండ్రులు బాలిక అదృశ్యంపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామన్నారు. నిందితుడిగా భావిస్తున్న వ్యక్తి నరేష్ ఆచూకీ కోసం గాలిస్తుండగా మంగళవారం ఉదయం గొల్లపల్లి బస్టాప్ వద్ద కనిపించగా అరెస్టు చేసి జనగామ కోర్టులో హాజరు పర్చగా అతన్ని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్టు ఎస్సై వివరించారు.

సెల్‌ఫోన్ అందజేత

జనగామ రూరల్: జనగామ రైల్వేస్టేషన్‌లో సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్న వ్యక్తికి మంగళవారం జీఆర్‌పీ పోలీసులు అందజేశారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన మరుఫ్.. సికింద్రాబాద్ నుంచి నాగాపూర్‌కు దక్షిణ్ ఎక్స్‌ప్రెస్‌లో వెళ్తున్న క్రమంలో చేతినుంచి ఫోన్ జారి పడిపోయింది. ఈక్రమంలో జనగామ స్టేషన్‌లో పెట్రోలింగ్ చేస్తుండగా గుర్తించిన జీఆర్‌పీ పోలీసులు రమణారెడ్డి, సుదర్శన్ వివరాలు సేకరించి బాధితుడికి అప్పగించారు.

దేశాన్ని అత్యున్నత స్థాయిలో నిలపాలి



స్టేషన్‌ఘన్‌పూర్: ర్యాలీలో విజయరామారావు

స్టేషన్‌ఘన్‌పూర్: భారత దేశాన్ని ప్రపంచంలో అన్ని రంగాల్లో అత్యున్నత స్థాయిలో నిలిపేలా యువత, విద్యార్థులు పాటుపడాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి డాక్టర్ గుండె విజయరామారావు అన్నారు. హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్ దూసరి విజయ్ ఆధ్వర్యంలో మంగళవారం పాఠశాల విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక శివాజీచౌక్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన జీవీఆర్ మాట్లాడారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఐలోని అంజిరెడ్డి, సట్ల వెంకటరమణగౌడ్, మంద రాజేష్‌రెడ్డి పాల్గొన్నారు.

మువ్వన్నెల జెండాలతో ర్యాలీ

నర్మెట/జఫర్‌గఢ్: బీజేవైం రాష్ట్ర కమిటీ పిలుపు మేర మండల కమిటీలు తలపెట్టిన హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా నర్మెట, జఫర్‌గఢ్‌లో నాయకులు విద్యార్థులతో కలిసి మువ్వన్నెల జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నర్మెటలో అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి పూలమాలలు వేశారు. రాజు, అవినాష్, అనిల్ కుమార్, ఆంజనేయులు, శ్రీనివాస్, రాజు, సిద్దులు, మురళి, కొంరెళ్లి పాల్గొన్నారు.

మొండిచింత తండాలో తీజ్ సంబురాలు



తీజ్ సంబురాల్లో కాంగ్రెస్ నాయకులు

దేవరుప్పుల: గిరిజనుల సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టే తీజ్ సంబురాలు మొండిచింత తండాలో జరిగాయి. మంగళవారం మండలంలోని ధర్మాపురం రెవెన్యూ పరిధి లక్ష్మణ్‌తండా గ్రామ శివారు మొండిచింత తండాలో తీజ్ బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు మాట్లాడుతూ గిరిజనులు వ్యవసాయం వర్ధిల్లాలనే ఆకాంక్షతోపాటు యువతుల కోర్కెలు తీర్చాలని జరుపుకునే పండుగ తీజ్ అని అన్నారు. మాజీ సర్పంచ్ వీరేషం, జిల్లా కార్యదర్శులు ధర్మారెడ్డి, పాండుకృష్ణ, ఎస్టీ, ఎస్సీ, బీసీ సెల్ మండల అధ్యక్షుడు సజ్జన్‌నాయక్, నాగరాజు, గణేష్, రెడ్డిరాజుల రమేష్, రామచంద్రు నాయక్, బోనగిరి యాకస్వామి, పులిగిళ్ల వెంకన్న, గంగరాజు, ఉమేష్ పాల్గొన్నారు.

దోషులను శిక్షించాలి

జనగామ రూరల్: పశ్చిమబెంగాల్‌లో వైద్యురాలిపై అత్యాచారం, హత్య చేసిన దోషులకు కఠిన శిక్షించాలని ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో ఐఎంఏ ఆధ్వర్యంలో మృతురాలి ఆత్మకు శాంతికలగాలని కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ప్రైవేట్ డాక్టర్లు స్వప్న రాథోడ్, లింగమూర్తి, నిశాంత్, కనకరాజు, అనుష, మౌనిక, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కొవ్వొత్తుల ర్యాలీలో డాక్టర్లు

సంక్షిప్త సమాచారంల

బస్సులు నడిపించండి



జనగామ రూరల్: పలు గ్రామాలకు ఆర్టీసీ బస్సు సర్వీసు లేక విద్యార్థులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే బస్సులు నడపాలని ఎస్‌డబ్ల్యూ హెచ్‌ఆర్సీ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎడ్ల స్వామి అన్నారు. ఈ మేరకు మంగళవారం హెచ్‌ఆర్సీ ఆధ్వర్యంలో జనగామ డిపో మేనేజర్ స్వాతికి వినతిపత్రం అందజేశారు. హెచ్‌ఆర్సీ జిల్లా చైర్మన్ అరుణ్‌కుమార్, వైస్ చైర్మన్ తిరుపతి, రాజు, శ్రీను, ఉమాపతి, సురేష్, పాల్గొన్నారు.

ఆర్థికసాయం

బచ్చన్నపేట: మండలంలోని కొన్నె గ్రామంలో చల్ల యాదమ్మ మృతి చెందింది. కాగా అంత్యక్రియల నిమిత్తం సామాజిక సేవాకర్త కోడూరి శివకుమార్ గౌడ్ బాధిత కుటుంబానికి రూ. 5వేల సాయం అందజేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

దేవరుప్పుల: మండలంలోని పలు గ్రామాల్లో బాధితులు, అనారోగ్య బారినపడిన వారి కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. మంగళవారం మండలంలోని మున్‌పహాడ్, ధర్మపురంలో మృతి చెందిన వేల్పుల కొండమ్మ, కమ్మంపాటి యాకయ్య మృతదేహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే లాకావత్‌తండాలో అనారోగ్యానికి గురైన లావుడ్యా బాలాజీని పరామర్శించి ఆర్థిక సాయం చేశారు.

చర్య తీసుకోవాలి

పాలకుర్తి: విద్యాలయంలో చదువుకుంటున్న విద్యార్థినిపై వేధింపులకు పాల్పడిన వారిపై చర్య తీసుకోవాలని మాజీ ఎంపీపీ నల్ల నాగిరెడ్డి కోరారు. మంగళవారం బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

అంకిత భావంతో పనిచేయాలి

జనగామ రూరల్: ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేస్తే సమాజంలో గుర్తింపు లభిస్తుందని మండల నోడల్ అధికారి వంగాల రాజేందర్ అన్నారు. మంగళవారం పసరమడ్ల ప్రాథమికోన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం మాధవి ఉద్యోగ విరమణ సన్మాన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీధి కుక్కలతో జాగ్రత్తగా ఉండాలి

బచ్చన్నపేట: గ్రామాల్లో వీధికుక్కలతో అందరూ జాగ్రత్తగా ఉండాలని మండల పశువైద్యాధికారి నాగప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని కొడవటూర్ గ్రామంలో ఆయన వీధికుక్కలకు యాంటీ రేబిస్ టీకాలను వేశారు. కార్యక్రమంలలో పంచాయతీ కార్యదర్శి బృంగి రూపాచైతన్య, మల్లేష్, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.